# పొంగు

"ఏమయ్యా, ఈ బస్సు యివాళ బయల్దేరదా?" అడిగాడు లాల్చీ వేసుకున్నాయన తెలుగు పేపరులో నుంచి తల ఒకింత బయటకు పెట్టి.

"పదకొండింటికి వర్షం వస్తుంది. పది గంటలయినా బస్సు బయల్దేరలేదు. పదకొండింటి లోపల నలభై మైళ్ళు ఎలా ప్రయాణం చేస్తామబ్బా" అంటున్నాడు పెళ్ళి చూపులకు కొడుకుని తీసుకు వెడుతున్న తండ్రి.

అవతలి సీట్లో కూర్చున్న అందమైన అమ్మాయి నున్నటి భుజాలు చూస్తున్నాడు కాబోయే పెళ్ళి కొడుకు.

"పోనీవయ్యా - బస్సుని త్వరగా, ఏమిటాలస్యం!" చేతిలో వున్న సెక్స్ పుస్తకాన్ని తెరుస్తూ అన్నాడు ముందు సీట్లో కూర్చున్న విద్యార్థి.

కండక్టర్ అన్నాడు నెమ్మదిగా, "డిపో మేనేజర్ గారు వస్తానన్నారు సార్. ఆయన రాగానే బయల్దేరుదాం!"

"అదేమిటి - తొమ్మిదిన్నరకు బయల్దేరాల్సిన బస్సు పదయినా బయల్దేరదు. పైగా డిపో మేనేజర్ రావాలంటావ్. ఆయన ఎప్పుడు వస్తాడో ఏమో" తెలుగు పేపరులో నుంచి బయటకు వచ్చిన తల అన్నది.

" వస్తారు సార్!" కండక్టర్ జవాబు.

"బస్సు ఆయన స్వంతంటయ్యా! - అసలు ఆయన కోసం యింతమంది ప్రయాణీకులకు ఆలస్యం ఎందుకవాలి?" పెళ్ళికొడుకు తండ్రి అన్నాడు.

"అవును. మేమంతా ఎందుకు ఆగాలి. పోనీ!" అవతలి సీట్లోని అందమైన అమ్మాయి వంపులను చూస్తూనే అన్నాడు కాబోయే పెళ్ళికొడుకు.

"ఉష్...!" అంటూ ఒక వేడి నిట్టూర్పుని విసుగ్గా విదిలాడు ముందు సీట్లోని విద్యార్థి - వేడి కథను చదువుతూ.

యింకో పావు గంట గడిచింది.

"ఏం బాబూ - మనం యివాళ బయల్దేరతామా అసలు" చదివేసిన తెలుగు పేపరును మడిచేసి అన్నాడు లాల్చీ వేసుకున్న ఆయన.

"ఇంటి దగ్గర బయల్దేరే ముందు పిల్లి ఎదురవగానే అనుకున్నాను. ఇవాళ ఏదో అశుభం జరుగుతుంది అని. వర్జం వచ్చిం తర్వాత పెళ్ళి చూపు లెలాగో అర్థం కావడంలేదు. పోనీ నాయనా కాలాతీతమవుతున్నది!" పెళ్ళి కొడుడు తండ్రి.

"ఏమిటయ్యా మరీ యింత ఆలస్యమయితే ఎలా" అని అంటున్న కాబోయే పెళ్ళి కొడుకు, ఆ అందమైన అమ్మాయి పమిట సర్దుకోవడం చూసి, మాటలాపేసి అటే చూస్తున్నాడు.

మధ్య పేజీలో అర్థ నగ్నంగావున్న సినిమా తార బొమ్మ ప్రక్కనే ఆవిడ తన వివాహం గురించి యిచ్చిన పవిత్ర అభిప్రాయాన్ని చదువుతున్న విద్యార్థి తల ఎత్తి, "పోనివయ్యా" అని అరిచాడు.

"అవును బస్సుని పోనీ - పోనీవయ్యా!" అందరూ అరుస్తున్నారు - ఆలస్యం భరించలేక, ఎండకు పడుతున్న చమటకు తాళలేక.

"ఎలా సార్! నాకు మాట వస్తుంది. ఆయన మా డిపో మేనేజర్ గారు."

"అయితే జీపులో పొమ్మనమను. అవేవీ లేకపోతే తర్వాత బస్సులో రమ్మను. అంతే కానీ మమ్మల్నందర్నీ ఆపితే ఎలా!" కోరస్‌గా అన్నారు బస్సులోని జనం.

కండక్టర్‌ని నానా మాటలు అన్నారు.

అతనికి తప్పింది కాదు.

రెండుసార్లు గంట కొట్టాడు.

ప్రక్కనే వున్న డ్రయివర్ వచ్చి ఇంజన్ - స్టార్టు చేశాడు.

బస్సు పెద్ద శబ్దం చేస్తున్నది.

కానీ కదలలేదు.

అయిదు నిమిషాలయింది.

"పోనీవయ్యా మళ్ళీ ఆగావేం?" నాలుగు కంఠాలు అన్నాయి ఒకేసారి.

"ఆయన రావాలి సార్!"- ఈసారి డ్రయివర్ అన్నాడు.

"ఆయన ఎవరయ్యా మధ్యలో. నీకు ఆఫీసరయితే మాకేం కాదు. మర్యాదగా బస్సుని కదుపు" అరిచాడు విద్యార్థి చేతిలోని పుస్తకాన్ని ప్రక్కన పెట్టి.

"కొంచెం ఆగండి సార్" కండక్టర్ అన్నాడు.

"ఏమిటి ఆగేది? అయిదు నిముషాల్లో బస్సు కదలకపోతే రిపోర్టు యిస్తాం" అన్నాడు తెలుగు పేపరు ఆయన.

కండక్టర్ చిన్నగా నవ్వాడు - "రిపోర్టు డి.యం. గారికే యివ్వండి సార్!"అన్నాడు.

"ఏం నవ్వులాటగా వుందా! అయిదు నిముషాల్లో బస్సు కదలకపోతే , అద్దాలు పగల కొడతాం, టైర్లు పంచర్ చేస్తాం - అసలు బస్సునే తగలబెడతాం!"

విద్యార్థి నాయకుడికి సపోర్టు యిచ్చారు అందరూ.

"పోనీ" గదిమాడు పెళ్ళికొడుకు తండ్రి.

"ఆయన ఆలస్యానికి బస్సేం చేసింది సార్!"

"బస్సునే కాదు. ఆయన్ను కూడా ఒక పట్టు పడతాం. రానీ చూద్దాం. మమ్మల్నందర్నీ తన ఒక్కడి కోసం కాచుక్కూర్చునేలా చేస్తాడా."

"పైకి రిపోర్టు యిద్దాం గురూ ఆయన మీద. పెద్దాళ్ళ బ్రతుకులన్నీ బయట పడతాయి!"

"అంతే - అంతే".

"ఉండండి సార్ - ఆయన వస్తున్నారు."

"రానీవయ్యా - ఆయన్ని నుంచోపెట్టి నాలుగూ దులిపేద్దాం."

"అవును రానీండి గురూగారూ - మనిషిని పట్టుకుని నానా చీవాట్లూ వేద్దాం!" విద్యార్థి ఆవేశంగా అన్నాడు.

సన్నగా బక్కపలచగా వున్న ఒక వ్యక్తి అక్కడికి వచ్చాడు.

కండక్టర్ ఆయన్ని చూసి "నమస్తే సార్!" అన్నాడు.

ఆయన తల వూపి, బస్సు ఎక్కాడు.

ఎక్కడా చోటులేదేమో యిబ్బందిగా చూశాడాయన.

కండక్టర్ ఒకసారి అటూ యిటూ చూసి - "లేవయ్యా లే - డి.ఎం. గారు కూర్చోవాలి' 'కసిరాడు ముందు సీట్లో కూర్చున్న విద్యార్థిని.

వెంటనే లేచినుంచుని ఆయనకు సీటు యిచ్చాడు విద్యార్థి.

తెలుగు పేపరులో మళ్ళీ తల దూర్చి చదువుకుంటున్నాడు లాల్చీ ఆయన.

పంచాంగం చూసుకుంటున్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

ఆ అమ్మాయి నున్నటి భుజాల మీద నుంచి కొంచెం ముందుకు తొంగి చూస్తున్నాడు కాబోయే పెళ్ళికొడుకు.

వెనుక కునికిపాట్లు పడుతున్నారు యిందాక అరిచిన నలుగురూ.

విద్యార్థి నాయకుడు బస్సులో పైన కడ్డీని పట్టుకుని నుంచుని వున్నాడు.

కండక్టర్ "టంగ్, టంగ్" మని గంట కొట్టాడు.

బస్సు బయల్దేరింది గంట ఆలస్యంగా.

మన తెలుగు వాళ్ళలాగా, బస్సుకి ఆరంభశూరత్వం లేదు మరి.